గృహ డైనమిక్స్ ప్రకారం సంసారాల్లో హీట్ ఎలా పుడుతుందో తెలుసుకున్నాము. దానికి పోయేందుకు వేరేమార్గం లేక ఇల్లాలిపై అది చూపే ప్రభావం ఎలా వుంటుందో మనం చర్చించాము. అసలు ఈ హిట్ పుట్టకుండా చేయవచ్చా? ఒక వేళ సంసారాలన్నీ తర్వాత కష్టసుఖాలు కోపతాపాలు ఎగుడు దిగుడులూ తప్పవు కనుక హీటెల్లాగు పుడుతుంది. ఈ కోప తాపాలకు ఉపశమనం మనం శాస్త్రోక్తంగా కల్పించలేము అని శాస్త్రజ్ఞులు విచారిస్తున్నారు.

బైదిబై - నేనో విషయం చెబుతాను. మన వాళ్లు ఇలాటి దుఃఖాలన్నిటికీ సులభ తాపోపశమనాలు ఎప్పుడో కనిపెట్టేశారు. శంకరుడు "సంసారం సాగరం దుఃఖం" తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త అన్నాడు కదా?

గుళ్ళోకి వెళ్ళడం, భజనలు చేయటం, వ్రతాలూ నోములూ పూజలు చేయటం, తీర్థయాత్రలను సేవించటం, బాబాలచుట్టూ స్వాములార్ల చుట్టూ ముక్తి ప్రసాదించమని తిరగటం యిదంతా ఏవిటి?

జీవితంలో పుట్టే హీట్‌ని అంటే పనుల వత్తిడి వలన కలిగిన ఉద్రేకాన్ని నాలుగువైపులా సర్దటానికి తిరపతి వెంకన్న, అన్నారం సత్తిన్నారాయణమూర్తి, సింహాద్రి అప్పన్న వున్నారు, కారా? సంసారంలో సుఖంలేదని తెలిశాక పరలోకంలో శాంతికోసం జీవుడు ఆశపెట్టుకోవటం తప్పనిసరి.

అందరూ కథలూ నావెల్సూ గట్రా వ్రాయలేరు. అందరూ యాక్టింగ్ చేయలేరు, పాడలేరు, గెంతలేరు. కాని వారిలో పుట్టే ఉద్రేకానికి బయటకు పోయేందుకు వీలుగా బాబాలు, వీభూతి పళ్ళూ, కోటాను కోట్ల దేవతలు, తిరుపతి వెంకన్నా, వ్రతాలూ వుపవాసాలూ అన్నీ వున్నాయి.

అంచేత నేనే వనుకుంటున్నానంటే మన కంట్రిలో శ్రీమతి పార్కిన్సన్స్ లా వలన ఏవ్వీ డేంజరు జరగటాని కవకాశం లేదు. అవటా - అని మన పతివ్రతలకు నోములు వ్రతాలు పూజలు శ్రీరామరక్ష. ఆడవాళ్ళ ఆరోగ్యం చెడిపోతే అపరిమిత పతి భక్తివలన చెడిపోవాలి. కాని యితరత్రా చెడిపోవటానికి వీల్లేదు. పతితకి, పతివ్రతకి మధ్య ఒక్క "వ్ర" అనే అక్షరం మాత్రవే తేడా. ఎందుకైనా మంచిది. మన లేడీస్ అట్టే హీటెక్కిపోకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో చల్లగా మంచి నీళ్ళ కూజాలా వుండవలసిందే. చీర ముడతలు పడినా పరవాలేదు. మనసు ముడతలు పడకూడదు.

# గరిట్లూ - చెంచాలూ

భీముడు గదపట్టుకున్న చేత్తోనే గరిట కూడా పట్టుకున్నాడు. ఇప్పుడు మన లేడీస్ గరిట పట్టుకునే చేత్తోనే కలం పట్టుకుంటున్నారు. శుభం! అల్లాగే కానివ్వండి. ఆ చేతిలోని గరిట వదిలేయకుండా వుంటే అంతేచాలు! కొందరు క్లైవరాతి క్లైవరు రమణులు ఆ గరిట అబ్బాయిగారి చేతికిచ్చి కథ నడిపిద్దామని చూస్తున్నారు. పాకశాస్త్రం కూడా శాస్త్రవే కదా. శాస్త్రమన్నాక

అందులో స్త్రీ పురుష విచక్షణ కూడదుగాకెంత మాత్రం కూడదు, కూడదు. గృహ నిర్వహణ శాస్త్రం అబ్బాయిలు మట్టుకెందుకు అభ్యసించకూడదు? డొమెస్టిక్ సైన్సు చదువుకుంటే నిరుద్యోగ సమస్య అనేదే వుండదే? అయితే నోట్లోకి నాలుగు వేళ్ళూ ఎలాపోతాయని అడగొచ్చు. స్త్రీలను వంట నుంచి ఇంటి చాకిరీ నుంచి తప్పిస్తే వారు లోక కల్యాణం చేయటానికి ఎక్కువ వీలవుతుందని సంఘ పురోభివృద్ధి - కాముకులు నొక్కి చెబుతున్నారు. కాముకుల మాటలను స్త్రీలు అక్షరాలా పాటించనవసరంలేదు. బైదిబై మనం గరిటను వదిలేసి చాలాదూరం వచ్చాము.

గరిట్లలో మిల్లి గరిట్లని వున్నాయి సినిమాలో బాల తారల్లాగ, ఇవే కాదు ఇంకా నానా జాతులూ వున్నాయి. పులుసు గరిట, పప్పు గరిట, మజ్జిగ గరిట, అన్నం గరిట అనీ సవాలక్ష పదార్థాలకు సవాలక్ష గరిట్లు వుండి తీరుతాయి. మనిషికీ మనిషికీ ఆకార రూపురేఖాది విలాసాలలో మార్పులున్నట్లే గరిటకూ గరిటకూ తేడాలుంటాయి. వుండాలి. సృష్టిలో వున్న వైవిధ్యమంతా గరిటల్లోనూ వుండితీరుతుంది. గరిటను తెడ్డు అని అనటం స్త్రీని ఆడది అని వెక్కిరించినట్లుంటుంది.

రుచిపాకము నాలుకగాకెరుంగనే తెడ్డది కూరలో కలయ ద్రిమ్మిరుచుండినసైన భాస్కరా అన్నాడు కవి. కాని స్త్రీలు తెడ్డు చేత్తో పట్టుకుని రుచిపాకము యెలావుందో తెలుసుకోవటానికి నాలిక వుపయోగిస్తారు. కూర ముక్కలు నోట్లో వేసుకుని చూడకుండా అమ్మడుకి పాపం వంట యెలా తగలడిందో యెలా తెలుస్తుంది? తెలియ త్తెలియదు. తెడ్డుకి కూర రుచి తెలిస్తే అది మనదాకా వస్తుందిటండి మీ వెర్రిగాని, తెడ్డు తెడ్డే నాలుక నాలుకే.

గరిట తరువాత చెప్పుకోదగ్గ ఆయుధం అబలలకు అట్లకాడ అట్టు తిరగేయడానికి వుపయోగించే కాడవంటి సున్నితమైన పరికరం. దీన్తో నైసుగా లఫ్లీగా తట్టుతేలేలా వాతలు పెట్టవచ్చు ఎవరైనా, యెవరికైనా, కొందరు లలనామణులు అట్లకాడను అస్తమానం తోముకోనవసరంలేదు. ఒకసారి నీళ్ళలోముంచి మళ్లీ మళ్ళీ వాడవచ్చు. వారానికోసారి చిళ్ల పెంకుతో బరికేస్తే చింతపండుతో తోమితే షైనింగు వస్తుంది అంటారు. అంట్లు తోముకోవడం బార్బరస్ అని కొందరంటారుగాని వారితో ఏకీభవించటానికి వీల్లేదు. అది ఒక వ్యాయామం. ఎక్సరసైజు చేయమంటే స్త్రీలు ముఖం త్రిప్పుకుంటారు గదా. అంట్లుతోము కొనడం వలన మన యింట్లో ఏయే గిన్నెలు వున్నాయో ఏవి సొట్టలు పడ్డాయో, ఏవి కాళ్ళొచ్చి పరిగెత్తుకెళ్ళాయో తెలుసుకోవచ్చు. ఇది అక్కవుంటింగుకి పనికివస్తుంది. జేబురుమాళ్లు అస్తమాను పోయినట్లే చిన్న చిన్న చెంచాలు మూతలు పోతూ వుంటాయి.

చెంచాలంటే జ్ఞాపకం వచ్చింది. గరిటకు చెంచా మనవరాలని మీకు తెలుసా? చెంచాకు గరిట గ్రాండ్‌మదరైతే అట్లకాడ చెంచాకు మేనమావ అనాలిసిందే. మా పెద్దమావయ్య చెంచా

అభారతీయం అంటాడు. తెలుగు డిక్షనరీలో చెంచా అనేమాట కనపడలేదు. డిక్షనరీలో కనపడక పోవటానికేమీ ఆశ్చర్యంలేదు. కొంపలోనే అవసరానికి ఒక్క చెమ్చా కూడా కనపడిచావదు.

చెమ్చాలు కాళ్ళొచ్చి వెళ్తాయో, వాటి పుటకే అంతేమోగాని అవి వున్నచోట వుండవు. కొత్త చోట్లకు జేబుల్లోకి బూట్లలోకి పుస్తకాల వెనక అలమారాలకింద పనివెళావెళ్లి దాక్కుంటాయి. ఒకప్పుడవి అద్దం వెనకాల దేవుడు గూట్లోనూ బాత్రూంలోనూ కూడా కనిపిస్తాయి. చెంచాలు సర్వాంతర్యాములు ఇందుగల దందులేదని సందేహమువలదు.

చెంచా అభారతీయం ఉద్ధరిణే మన సంస్కృతి అని మా పెద్దమామయ్యా అంటూ వుంటాడు. ఉద్ధరిణి డిజైన్ మటుకు చాలా ఓరియంటల్‌గా పకడ్బందీగా వుంటుంది. చెంచాలు సాదా సీదాగా వుంటాయి. వెండి ఉద్ధరిణలు, రాగి ఉద్ధరిణలు వున్నట్లే, వెండివీ, ఇత్తడివీ, స్టీలువీ, సత్తువీ అని నానా గోత్రభ్యా వున్నాయి చెమ్చాలు. ఇప్పుడిప్పుడే ప్లాస్టిక్ చెమ్చాలు కూడా విరివిగా వాడకంలోకి వస్తున్నాయి. చెంచాలు రకరకాలవి ప్రోగుచేయటం మంచికళే. కాని అవి మనింట్లోవై వుండాలి. లేకపోతే ప్రమాదం.

మనుషుల్లో ఖరీదైన మనుషులూ చవకబారు మనుషులూ అని వున్నట్లే చెమ్చాల్లో కూడా పలు వెరైటీలున్నాయి. ఒక గరిట మరొక దాంట్లో న్యాయంగా పెట్టకూడదు. అల్లాగే యీ పాతివ్రత్యధర్మం చెమ్చాలకు కూడా వర్తిస్తుంది.

డాక్టర్లు మందు యిన్ని చెమ్చాలు తీసుకొండి అంటారు. అన్ని చెమ్చాలు మ్రింగమనికాదు డాక్టరు తాత్పర్యం. చెమ్చాలను వదిలేసి మందు మాత్రమే మింగాలని రూలు. నవలల్లో పెద్దసైజు నవల లున్నట్లే చెమ్చాల్లో కూడా మరీ పెద్ద సైజు చెమ్చాలుంటాయి. ఆ చెంచాలను జయంట్సు మాత్రమే వుపయోగించగలరు. చిన్న చిన్న చెంచాలు ముద్దుగా షోగ్గా నీటుగా వుంటాయి. చెంచాలు అప్పుడప్పుడు తలా తోకా తెలీకుండా విరిగిపోతాయి. విరిగిపోయిన చెంచా కథ ఎవరైనా వ్రాస్తే వ్రాయవచ్చు. మన ఇళ్లలోని ఒక గరిట దగ్గర్నుంచీ చెంచా వరకు ఒక చిన్న హిస్టరీ వుండి తీరుతుంది. ప్రతిపని ముట్టుకూ ప్రతి స్వల్పవస్తువుకూ చరిత్ర ఉండే వుంటుంది. చెంచా కథలని ఎవరైనా రాస్తే రాయొచ్చు. ప్లాస్టిక్కు చెంచాలు నేను చాలా ప్రోగుచేశాను. రంగు రంగులవి అవి చాలా తమాషాగా ఉంటాయి. ఈ చెంచాలు వచ్చాక ఉగ్గు గిన్నెలు మూలబడ్డాయి. చెంచాతో ఆముదమైనా త్రాగించవచ్చు. అమృతమైనా త్రాగించవచ్చు. ఉప్పయినా వేయవచ్చు. పంచదారైనా వేయవచ్చు. పాలైనా కలపవచ్చు. విషమైనా కలపవచ్చు. చెంచాను పట్టుకున్న చేతిదే ఆ శక్తి అంతా.

కడగని చెంచాలు కాలదోషం పట్టిన వాగ్దానాల వంటివి. నూరు చెంచాలయినా ఒక గరిటకు సాటిరావు. కాని గరిట పని గరిటదే చెంచా పని చెంచాదే. లోకం తీరే అంత, చెంచాలు తిరగబడే రోజు వచ్చినపుడు గరిట హిస్టరీ గల్లంతవుతుంది.